మదనపల్లి జిల్లా సాధనే లక్ష్యం : మాజీ ఎమ్మెల్యే

ర్యాలీని ప్రారంభిస్తున్న రమేష్

ప్రజాశక్తి-మదనపల్లి : మదనపల్లె జిల్లా సాధనే లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ అన్నారు. మంగళవారం అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీ నగర్ నుండి వివిధ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే మదనపల్లెను జిల్లాగా ప్రకిటిస్తామని తెలిపారు. ఈ విషయం ఇదివరకే మదనపల్లె మినీ మహానాడు వేదికగా నారా చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం జనసేన రాయలసీమ కో-కన్వీనర్ రాందాస్ చౌదరి, బహుజనసేన నాయకులు శ్రీచందు మాట్లాడుతూ మదనపల్లిను జిల్లాగా చేసేందుకు అన్ని సదుపాయాలు సంపూర్తిగా ఉన్నా జిల్లా చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు.

ఇఎంటి పోస్టుల భర్తీలో ఇష్టారాజ్యం

- అనర్హులుగా మెడికల్ ఇన్‌సర్వీస్ పీజీలు!
- పులివెందుల వైద్య కళాశాల పోస్టింగ్స్ భర్తీలో తిరస్కృతి
- జిజిహెచ్‌లో మూడు పోస్టుల భర్తీకి బ్రేక్
- గైడ్‌లైన్స్ అప్‌డేట్ కావడంలో వైఫల్యం

ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇఎంటి) పోస్టుల భర్తీలో ఇష్టారాజ్యం నడుస్తోంది. 2008లో అప్పటి వైఎస్ సర్కారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 108లో మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎమర్జెన్సీ మెడికల్ ఇన్‌సర్వీస్ పోస్టు గ్రాడ్యుయేషన్ డిప్లమా కోర్సులకు శ్రీకారం చుట్టింది. పీజీ డిప్లమా కోర్సును పూర్తి చేసిన వారిని ఎమర్జెన్సీ మెడికల్ పోస్టులకు రిక్రూట్‌మెంట్ చేసింది. తాజాగా జిజిహెచ్, పులివెందుల మెడికల్ కళాశాలలో భర్తీ నిమిత్తం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఇన్‌సర్వీస్ పోస్టు గ్రాడ్యుయేషన్ పీజీ (డిప్లమా) పూర్తి చేసిన అభ్యర్థుల దరఖాస్తులను తిరస్కరించడం చర్చనీయాంశంగా మారింది. బిఎస్‌సి ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (డిగ్రీ తరహా) కోర్సు పూర్తి చేసిన వారిని అర్హులుగా నిర్ణయించి, పీజీలను విస్మరించడం విమర్శలకు ఆస్కారాన్ని కలిగిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియ ఊపందుకుంది. కడప ప్రభుత్వ వైద్య కళాశాల యంత్రాంగం 48 ఇఎంటి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 48 మంది టెక్నీషియన్ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 12 మంది పీజీ డిప్లమా, 12 మంది బిఎస్‌సి, మరో 18 మంది ఇతర కోర్సులు చేసిన అభ్యర్థుల దరఖాస్తులు ఉన్నట్లు సమాచారం. 12 పీజీ దరఖాస్తులను తిరస్కరించి భర్తీ చేపట్టడం పీజీల్లో ఆందోళన నెలకొంది. 2013 సంవత్సరంలో 108 సేవల విభాగంలో సీనియర్లుగా గుర్తింపు పొంది, ఎంట్రన్స్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులను పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులకు ప్రభుత్వం ఎంపిక చేసింది. బిఎసి కంటే ఉన్నత విద్య పీజీ కోర్సును అభ్యసించిన వారిని విస్మరించి డిగ్రీ (బిఎస్‌సి ఇఎంటి) చేసిన వారిని అర్హులుగా నిర్ణయించమేమిటనే ప్రశ్న వినిపిస్తోంది. 2022 నవంబర్‌లో విజయనగరం, తాజాగా కడప జిల్లాలో మినహా మిగిలిన జిల్లాలో కొత్తగైడ్ లైన్స్ ప్రకారం పీజీలను పోస్టింగ్స్‌కు అర్హులుగా చేసి పోస్టుల భర్తీ నడిపిన జిల్లాలను ఉదహరిస్తుండడం గమనార్హం. గైడ్‌లైన్స్ అప్‌డేట్ గాకుండా ఇష్టానుసారంగా వ్యవహరించమేమిటనే వాదన వినిపిస్తోంది. 2022 ఆగస్టులో రాష్ట్రంలోని 10 పాత వైద్య కళాశాలలకు మూడు పోస్టుల చొప్పున 64 టెక్నీషియన్ పోస్టులను భర్తీ ప్రక్రియ నడిచింది. ఇప్పటి వరకు 61 పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం. మిగిలిన మూడు పోస్టులు ముఖ్యమంత్రి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందినవి కావడం గమనార్హం. వీటిని భర్తీ చేయాలనే జాయింట్ కలెక్టర్ సూచనను జిజిహెచ్ సూపరింటెండెంట్ బేఖాతర్ చేశారనే విమర్శలు ఉన్నాయి. త్వరలో పులివెందుల మెడికల్ కళాశాల ఇఎంటి పోస్టుల భర్తీ ప్రక్రియలో పీజీలను తిరస్కరించడం పట్ల చర్చనీయాంశంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి యూనివర్శిటీగా నామకరణం చేసిన మెడికల్ కళాశాలల్లో ఆయన ఉన్నత విద్యకు సిఫారసు చేసిన పీజీ అభ్యర్థులను తిరస్కరించడం విస్మయాన్ని కలిగిస్తోంది. 2022 ఆగస్టు, 2023 మార్చి, తాజాగా నెల రోజుల కిందట నోటిఫికేషన్ విడుదల చేసి ఇష్టారాజ్యంగా టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టడమేమినే ప్రశ్న వినిపిస్తోంది. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల రిక్రూట్‌మెంట్‌లో పీజీ డిప్లమా, బిఎస్‌సి ఇఎంటిలకు సమాన అవకాశాలు కల్పించిన అనంతరం మెరిట్ ఆధారంగా రిక్రూట్ మెంట్ నిర్వహించాలనే వాదన వినిపిస్తోంది.

కంబైన్డ్ నోటిఫికేషన్‌లో భర్తీ చేస్తాం

ఇఎంటి పోస్టింగ్స్‌కు కంబైన్డ్ నోటిఫికేషన్‌లో ఇవ్వడమైంది. డిఎంఇ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపల్‌తో కలిసి రిక్రూట్‌మెంట్ ప్రొసీజర్‌ను పాటించి జాబితాను సిద్ధం చేశాం. జిజిహెచ్ పరిధిలోని మూడు పోస్టింగ్స్‌ను చేర్చాం. ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్ సంతకం చేయడంతో భర్తీ ప్రక్రియ పూర్తి కానుంది.

- కె.రమాదేవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, కడప.

కల్యాణమస్తును సద్వినియోగం చేసుకోండి : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీతోఫా కింద అక్టోబర్ - డిసెంబర్ 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 10,132 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.78.53 కోట్ల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమానికి కలెక్టరేట్‌లోనిస్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్, డిడి సోషల్ వెల్ఫేర్ జాకీర్ హుస్సేన్, వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి సందప్ప, లబ్ధిదారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద కుటుంబాల తల్లిదండ్రులకు వారి పిల్లల పెళ్లిళ్లు ఆర్థిక భారం కాకూడదని, వారిని ఆర్థికంగా ఆదుకోవడం కోసం పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. పథకాలు కేవలం ఆర్థిక సాయం కోసం మాత్రమే కాకుండా ఆడపిల్లలకు చదువు విలువను కుటుంబాలకు తెలియజేసేందుకు కూడా ఉపయోగపడుతుందన్నారు. పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధి పొందిన వారు, వారి గ్రామాలలో లేదా పట్టణాలలో పేద కుటుంబాలలో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లాలోని 356 మంది అర్హులకు సంబంధించి రూ. 2,91,15,000 మెగా చెక్కును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

'పది'లో ఉత్తమ ఫలితాల కోసం కృషి : ఆర్‌జెడి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జెడి రాఘవరెడ్డి

ప్రజాశక్తి- రాయచోటి

పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలని కడప పాఠశాల విద్య శాఖ ఆర్‌జెడి ఎద్దుల రాఘవరెడ్డి అన్నారు. డిఇఒ యు.శివ ప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం స్థానిక మాసాపేట సాయి శుభకల్యాణ మండపంలో అన్నమయ్య జిల్లా మండల విద్యాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పదో తరగతి పరీక్షల ఉత్తమ ఫలితాల కోసం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎంతమంది ప్రభుత్వ ఉపాధ్యాయులు, అధి .కారులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివిస్తున్నారో వారు చెయ్యి ఎత్తండి అని అడుగగా సమావేశంలో సుమారు 400 మంది మండల విద్యాధికారులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉండగా అందులో కేవలం పది మంది మాత్రమే చేయి ఎత్తడంతో వారిని కడప ఆర్‌జెడి ప్రత్యేకంగా అభినందించారు. పిల్లలకు చదువు చెప్పడం సేవగా భావిం చాలని సూచించారు. టెన్త్ క్లాస్ విద్యార్థికి కనీసం తెలుగు పుస్తకం చదవడం రాకపోతే తప్పెవరిదో అర్థం చేసుకోవా లన్నారు. టెన్త్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని నాణ్యమైన విద్యను అందించే టీచర్ల పై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందన్నారు. సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయుల బోధన సమయం లోని లోపాలను గుర్తించి నివేదిక తయారు చేసి, సంబంధిత ఉపాధ్యాయులను హెచ్చరించాలన్నారు. నిబద్ధతతో పనిచేసినప్పుడే ఉత్తమ ఫలితాలు ఆశిం చగలమని సూచించారు. ఇందుకోసం మండల విద్యాధికారులు తరచూ పాఠశాలలు తనిఖీ చేయా లన్నారు. పదవ తరగతి ఫలితాల్లో అన్నమయ్య జిల్లా మొదటి స్థానం రావాలని కోరారు. 'మన జీవితంలో ఉపాధ్యాయుని ప్రాధాన్యత' గురించి క్షుణ్ణంగా వివరించారు. డిఇఒ యు.శివ ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డ్స్ ఉపయోగించి బోధించాలని, ఉపాధ్యాయులు కూడా బైజూస్ టాబ్స్ క్లాస్ కి తీసుకురావాలని అన్నారు. నూతన సాంకేతికను ఉపయోగించి బోధించడం ద్వారా పదో తరగతి ఉత్తమ ఫలితాలను సాధించాలని అన్నారు. మదనపల్లి డివైఈవో శ్రీరామ్ పురుషోత్తం, ఏడి ప్రసాదబాబు మాట్లాడుతూ పేద విద్యార్థుల వల్లే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది విలాసవంతమైన జీవితం గడుపుతున్నారని కాబట్టి వారిని కూడా మన సొంత బిడ్డలుగా భావించి నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో డిసిఇబి కార్యదర్శి నాగమునిరెడ్డి, సార్వత్రిక విద్య జిల్లా సమన్వ యకర్త శ్రీనివాసరాజు, సర్వ శిక్ష అభియాన్ సెక్టోరియల్ అధికా రులు కరుణాకర్, రాధమ్మ, చంద్రశేఖర్ నాయక్, షమీవుల్లా, డి.సి.ఈ.బి సభ్యులు అత్తార్ రియాజ్, కిరణ్ కుమార్ రెడ్డి, పొట్టి రెడ్డి, జిల్లాలోని ప్రభుత్వ, జడ్‌పి మండల విద్యాధికారులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు ప్రిన్సిపళ్లు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తా : ఆర్ఆర్

ప్రజాశక్తి రాయచోటి : తాను ఎప్పుడూ ప్రజలతోనే ఉన్నా భవిష్యత్‌లో సైతం ప్రజల కోసం పని చేస్తానని రాబోయే ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ నుంచే పోటీ చేస్తానుని మాజీ ఎమ్మెల్యే అర్.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను పార్టీ మరుతాననే ప్రచారం ఊహాజనితం వదంతులను నమ్మొద్దు అన్నారు. టిడిపిలోనే ఉంటా..టిడిపి అభ్యర్థిగానే పోటీ చేస్తానని చెప్పారు. ఇప్పటికే నియో జకవర్గం ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నాని తెలిపారు. నియోజకవర్గమంతా తిరిగి పార్టీ చేపట్టిన అన్ని కార్యక్రమాలు బాధ్యతతో నిర్వహించానని తెలిపారు. సమయం తక్కువ ఉండటంతో సభలు నిర్వహిస్తున్నానని పేర్కొన్నారు. సమావేశంలో మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి రమణారెడ్డి పాల్గొన్నారు.

ముస్లిములకు అండగా ఉంటా :'మండిపల్లి'

ప్రజాశక్తి - రాయచోటి : రాయచోటి ముస్లిం మైనారిటీలతో మండిపల్లి కుటుంబానికి విడరాని ఆత్మీయ బంధం ఉందని మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ముస్లిం మతగురువు షర్ఫుద్దీన్ స్వగృహంలో ఏర్పాటుచేసిన ముస్లిముల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాయచోటి ముస్లిం మైనార్టీల ఆర్థిక, విద్యాభివృద్ధికి తాను ఎల్లవేళలా తోడుంటానని, ప్రతిసారీ అబద్ధాలు చెప్పుకుంటూ వ్యక్తిని, సామాజిక వర్గాలను, నియోజకవర్గ ప్రజలను మోసం చేసే వ్యక్తిత్వం మండిపల్లి కుటుంబానిది కాదని స్పష్టం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడితే రాయచోటి పట్టణంలోని హిందూ, ముస్లిం, క్రిష్టియన్లతో పాటు ప్రతి సామాజిక వర్గాన్ని న్యాయం చేకూరేవిధంగా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. రాయచోటి తెలుగుదేశం పార్టీ కోసం రానున్న ఎన్నికల దృష్ట్యా ఏ విధంగా ముందుకెళ్లలో ముస్లిం మైనారిటీలతో చర్చించారు. ఆత్మీయ సమావేశంలో ప్రభుత్వ సర్ఖాజీ షర్ఫుద్దీన్, సోదరుడు హుస్సైని, అమీర్, ఉస్మాన్, తాలిబ్, ఖదీర్, షంషీర్, పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థుల కోసం కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి - రాయచోటి : జిల్లాలో ఈనెల 25న జరగబోయే గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో ఈనెల 23 నుంచి 25 వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయబోతున్నట్లు కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాయబోయే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన, 08561-293006 నెంబరుకు కాల్ చేస్తే, అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు కంట్రోల్ రూమ్ వారు సహకరిస్తారని తెలిపారు.

శ్రీనివాసరాజును కలిసిన కృష్ణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో రాజంపేట జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజును జనసేన నాయకులు అతికారి కృష్ణ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వారిని శ్రీనివాసరాజు సాదరంగా స్వాగతించి శాలువాతో సత్కరించారు. ఇరువురు నేతలు జనసేన టిక్కెట్ ఆశావహులు భేటీ కావడంపై నియోజకవర్గ ప్రజలలో ఆసక్తి చోటు చేసుకుంది. కార్యక్రమంలో అతికారి వెంకటయ్య, టిడిపి మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, జనసేన నాయకులు శింగంశెట్టి నరేంద్ర, నాసర్ ఖాన్, గురివిగారి వాసు, అబ్బిగారి గోపాల్, కె.ఆర్, రాజేష్ వర్మ, అదృష్టదీపుడు, కంబయ్యగారి నరసింహ, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ లేకుంటే కఠిన చర్యలు : డిఐఒ ఉషశ్రీ

ప్రజాశక్తి-మదనపల్లి

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉషశ్రీ

ప్రయివేట్ ఆస్పత్రుల వైద్యులు, స్కాన్ కేంద్రాల వైద్యులు, ల్యాబ్స్, డయాగ్నోస్టిక్స్ కేంద్రాల సిబ్బంది రోజువారీ, నెలవారీ నివేదికలు ప్రభుత్వానికి ఇవ్వాలని అన్నమయ్య జిల్లా పిసిపిఎన్‌డిటి నోడల్ అధికారి, డిఐఒ డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం జిల్లా ఆస్పత్రిలోని డిఇఐసి హాల్‌లో డివిజన్ పరిధిలోని ప్రయివేటు ఆస్పత్రులు, స్కాన్ సెంటర్స్ వైద్యులు ల్యాబ్స్, డయాగ్నోస్టిక్స్ సిబ్బందికి వారు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన నివేధికలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ ఎపిఎపిఎంసిఇ 2002 చట్టం, పిసిపిఎన్‌డిటి చట్టం 1994 ప్రకారం ప్రయివేటు ఆస్పత్రులు, స్కాన్ సెంటర్స్, ల్యాబ్స్, డయాగ్నోస్టిక్స్ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకుని నడుపుకోవాలని లేనిచో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిలో ఉండాల్సిన కనీస సౌకర్యాలు తాగునీరు, రోగులు వేచియుండు హాల్, మరుగుదొడ్లు, వార్డులు, ఫైర్ సేఫ్టీ, లిఫ్ట్, ర్యాంప్, పార్కింగ్ ప్రదేశం వంటివి తప్పక నిర్వహించాలని ఆదేశిం చారు. రోగులకు అందించు చికిత్సలకు బిల్లులు ఇవ్వాలి, వారు అందించు చికిత్సలకు చేయు ఛార్జిలు అనగా ధరల పట్టికను రెసెప్షన్‌లో ప్రజలకు కనపడే విధంగా ఉంచాలన్నారు. డిప్యూటీ డెమో దేవశిరోమని మాట్లాడుతూ స్కాన్ సెంటర్స్ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం యొక్క పోస్టర్స్, బ్యానర్లు కనపడేలా అంటించాలి, ఆరోగ్యశ్రీ అనుమతి పొందిన ఆస్పత్రులు ఆరోగ్యశ్రీలో లభించే సేవలపై ఉన్న పోస్టర్లు ప్రజలకు కనపడేలా ఉంచాలని పేర్కొన్నారు. ఆరోగ్య మిత్రలు షిఫ్ట్ పద్ధతిలో అందుబాటులో ఉండాలని ప్రస్తుతం బాల, బాలికల నిష్పత్తి 934 ఉందన్నారు. మందులకు ఫార్మసీలో కూడా బిల్ ఇవ్వాలని, స్కాన్ చేయించుకున్న వారికి కూడా బిల్ ఇవ్వాలని ఆదేశించారు.మదనపల్లె డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ప్రయివేటు ఆస్పత్రి, ల్యాబ్, స్కాన్ సెంటర్ తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. డిఎస్ఒ కరీముల్లా మాట్లాడుతూ రోజు వారీ ఆస్పత్రిలో ఒపి వివరాలు, ఐపి వివరాలు, కాన్పులు, అబార్షన్స్, సిజేరియన్ ప్రసవాలు, మాతా శిశు సంరక్షణ సేవలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు, ల్యాబ్‌టెస్ట్‌లు, జనన, మరణాలు ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లా అంటువ్యాధుల పర్యవేక్షకులు వెంకటేష్ మాట్లాడుతూ నమోదవుతున్న అంటువ్యాధులు అనగా వైరల్ జ్వరాలు, టిబి, కామెర్లు, అతిసార వంటి వాటి వివరాలు ఐహెచ్‌ఐపి పోర్టల్, ఆప్‌లో అప్లోడ్ చేయాలని పేర్కొన్నారు. అసంక్రమిత వ్యాధుల వివరాలు అనగా షుగర్, బిపి, పక్షవాతం, థైరాయిడ్, గుండెజబ్బు వంటి వ్యాధుల వివరాలు రోజువారీ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. స్కాన్ నిర్వహించిన గర్భవతుల వివరాలు పిసిపిఎన్‌డిటి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. పై వివరాలు అన్నిటికి ఫిసికల్ కేస్ షీట్లు ఫైల్ చేయాలని ఆన్‌లైన్‌లో పొందుపరచే రిపోర్టు అన్నియు హార్డ్ కాపీలు నిల్వ ఉంచాలని తెలిపారు. ఇప్పటికే పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిల ద్వారా వారి పరిధిలోని ఆస్పత్రుల, ల్యాబ్స్, స్కాన్ సెంటర్స్ వివరాలు సేకరించామని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి ఇప్పటికే తాకీదులు ఇచ్చామని వారు నిర్దేశించిన గడువులోపు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా అప్లై చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ ఒపిలో నమోదయ్యే జ్వరాల వివరాలు రోజువారీ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. నెలనెలా ప్రయివేటు ఆస్పత్రుల రెపోర్టులు పర్యవేక్షణకు గాను డివిజన్ స్థాయిలో కమిటీలు వేస్తున్నామని వారు చెక్ లిస్ట్ ప్రకారం తనిఖీ చేసి రిపోర్టు ఉన్నతాధికారులకు అందచేస్తారని తెలిపారు. సమావేశంలో ఎన్‌జిఒ నిర్వాహకులు లలిత, మదనపల్లె డివిజన్ పరిధిలోని ప్రయివేటు ఆస్పత్రుల వైద్యులు, స్కాన్ సెంటర్, ల్యాబ్, డయాగ్నోస్టిక్స్ నిర్వాహకులు హెల్త్ ఎడ్యుకేటర్స్ మహమ్మద్ రఫీ, రాజగోపాల్, ఉష, సిబ్బంది అమర, గోపాల్ పాల్గొన్నారు.

'జామియా మసీదు స్థలాన్ని స్వాధీన పరచాలి'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మాట్లాడుతున్న డాక్టర్ హుస్సేనీ

జామియా మసీదు స్థలం కోసం నిరాహార దీక్ష చేసే యోచనలో ముస్లిం మైనార్టీ పెద్దలు ఉన్నారని సివిల్ రైట్స్ యాక్టివిస్ డాక్టర్ హుస్సేనీ అన్నారు. మంగళవారం తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ జామియా మసీదు స్థలాన్ని స్వాధీన పరుస్తామని అధికార ప్రభుత్వం, గత ప్రభుత్వాలు కేవలం మాటలకే పరిమితం చేశారని ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. అధికారం కోసం రాజకీయ పార్టీ నాయకులు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుంటున్నారని, తర్వాత జామియా స్థలం ఊసే లేకుండా పోతుందని మండిపడ్డారు. రాయచోటి సబ్ డివిజన్ అయిన తర్వాత జామియా మసీదు స్థలం 5 ఎకరాల 50 సెంట్లు ప్రభుత్వ కళాశాల నుంచి బదిలీ తర్వాత ఆ స్థలం కొలతలు వేసి స్వాధీన పరుస్తామని చెప్పి మాటలకే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార ప్రభుత్వం జామియా మసీదు స్థలాన్ని అప్పగించేంతవరకు నిరాహార దీక్షను కొనసాగిస్తామని అన్నారు. మీ వల్ల చేతకాకపోతే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా మైనార్టీ నాయకులకు నిలబెట్టి సత్తా చాటుతామని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైనార్టీ పెద్దలు తాళిబలి ఖాన్, సయ్యద్ ఉస్మాన్, ఖదీర్, చాలక్ అమీర్, మాజీ కౌన్సిలర్ ఖాదర్ మోయుద్దీన్, అన్వర్, హసన్, షంషీర్, మూజు మహబూబ్ బాషా, వేంపల్లి షఫీమైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో కేసుల పరిష్కారం : ఎస్‌పి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి కృష్ణారావు

ప్రజాశక్తి-రాయచోటి క్రైం

సమగ్ర దర్యాప్తుతో కేసులు పరిష్కారమవుతాయని, కేసుల నమోదు మొదలు న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు వరకు ప్రతి అంశాన్ని పరిశీలించాలని ఎస్‌పి బి.కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సిబ్బందితో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలని సూచించారు. కోర్టులో స్పీడ్ ట్రయిల్ మానిటరింగ్ ద్వారా కేసులలోని నిందితులకు తగిన శిక్షపడేలా కృషి చేయాలని తెలిపారు. ప్రాపర్టీ నేరాల్లో నిందితులను త్వరగా పట్టుకోని రికవరీ శాతాన్ని పెంచాలని చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మరం చేసి చట్ట వ్యతిరేక, అసాంఘీక కార్యక్రమాలను కట్టడి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్లో పరిధిలో పలు కేసులను సమీక్షించి, తీవ్ర నేరాలతో వున్న కేసుల దర్యాప్తు వివరాలు, కోర్టులో చార్జిషీట్ దాఖలు, ప్రస్తుతం కోర్టులో ట్రయల్ ఏ దశలో ఉన్నాయి వంటి వివరాలు అడిగి తెలుసుకొని, సంబంధిత సీడీ ఫైల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. హత్య, రేప్, పోక్సో, ప్రాపర్టీ, గంజాయి మున్నగు గ్రేవ్ కేసుల్లో దర్యాప్తు, ముద్దాయిలు అరెస్టులపై సర్కిల్ వారీగా పోలీసు అధికారులను ఆరా తీసి, అపరిష్కృతంగా ఉన్న గ్రేవ్ కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పురోగతి సాధించి పరిష్కరించాలనిమ పేర్కొన్నారు. కేసు నమోదు నుండి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నికూలంకుషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వాహన తనిఖీలు చేపట్టి చలానాలు విధిస్తూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చేయాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌పై దృష్టి సారించాలని, రాత్రి గస్తీ పెంచి ఆస్తి నేరాలు జరిగే ప్రాంతాలపై నిఘా ఉంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, చోరీ సొత్తు రికవరీ పెంచాలన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని, వారి సమస్యలను ఓపికగా విని, ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకం కలిగే విధంగా సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ బి.బి.రాజ్ కమల్, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ : 'నల్లారి'

ప్రజాశక్తి-పీలేరు

గూడరేవుపల్లి టిడిపి నాయకులతో కిషోర్ కుమార్‌రెడ్డి

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మహానాడులో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం తథ్యమని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గూడరేవుపల్లిలో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఆ గ్రామంలో కొత్తగా నిర్మించిన శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గూడరేవుపల్లిలో తెలుగుదేశం శ్రేణులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు. మర్రిమాకులపల్లి, తాండా, పుట్టావాండ్లపల్లి, రామానాయక్ తాండా, గూడరేవు పల్లితో పాటు పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశక్తి, అన్నదాత, యువగళం, బిసిలకు రక్షణ చట్టం, ఇంటింటికీ మంచి నీరు, పూర్ టు రిచ్ పథకాలకు రాష్ట్ర ప్రజల్లో అపూర్వ ఆదరణ లభిస్తోందన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంచుతూ పథకాల గురించి తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధికి వనరులు సృష్టించడం చేతగాక మోసపూరిత పథకాలతో భావితరాలకు భరోసా ఇవ్వలేని జగన్ పాలనకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కల్లబొల్లి మాటలతో ఇంత కాలం ప్రజలను మోసం చేసిన అధికార వైసిపి నేతలకు తెలుగుదేశం పార్టీకి లభిస్తున్న ఆదరణ చూసి గుండెల్లో గుబులు మొదలైందన్నారు. రాష్ట్రంలో ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతిలో మోసపోయిన అన్ని రంగాల ప్రజలకు ధైర్యం చెప్పేందుకు తాము భవిష్యతకు భరోసా కార్యక్రమం నిర్వహి స్తున్నట్లు తెలియజేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక అన్ని వర్గాల ప్రజలుకూ మేలు జరుగుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులు, ప్రజలకు పిలుప ునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, నల్లారి అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

మంచి ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మార్చిలో జరగబోవు పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎపి మోడల్ స్కూల్లో 11వ వార్షికోత్సవ ఇంటర్, పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్‌స్కూల్లో పేద విద్యా ర్థులకు ఇంగ్లీష్ మాధ్యమం అందించడం ఒక వరమని అందులో అటల్ టింకరింగ్ మెకానికల్ ఒకేష నల్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి పేద విద్యార్థి కష్టపడి చదివి మంచి పదవులు అలంకరించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు మంచి డిగ్రీ పొంది ఐఎఎస్, ఐపిఎస్, గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యి మంచి ఆఫీసర్‌గా తమ ముందుకు రావాలని ఆకాంక్షించారు. 11 సంవత్సరాలు నుంచి ఎపి మోడల్‌స్కూల్ మండల టాపర్‌గా నిలిచి ఎంతో మంది విద్యార్థులు ట్రిబుల్‌ఐటిలో సాఫ్ట్‌వేర్ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారని ఆయన అన్నారు. 2024 మార్చిలో జరగబోవు పదవ తరగతి, ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తేవాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగయ్య , అధ్యాపకులు నిత్యపూజయ్య, సుధాకర్, రాజ్‌కుమార్, సుజాత, శ్రీనివాసులు, విజయ, కుమారి అరుణ్‌కుమారి, శ్రీకళ భారతి, ప్రసాద్, పీడీ సోమశేఖర్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రచార కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు

రాబోయే ఎన్నికల్లో టిడిపిదే విజయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ మహిళా నాయకులు నగిరిపాటి రేవతి పేర్కొన్నారు. మండలంలోని మైసూరువారిపల్లి గ్రామపంచాయతీ, ఓబులవారిపల్లి మండలంలోని గద్దలరేవుపల్లి గ్రామపంచాయతీలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. సూపర్ సిక్స్ పేరుతో మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగభృతి కింద నెల రూ.3వేలు, రైతులకు ఏటా రూ.20వేలుతో పాటు, బిసి సంక్షేమానికి కృషి చేస్తారని తెలిపారు. టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగిరిపాటి రేవతితో పాటు జనసేన పార్టీ మహిళా నాయకురాలు సర్పంచ్ కారుమంచి సంయుక్త, జనసేన పార్టీ నాయకులు పగడాల వెంకటేష్, రాజంపేట పార్లమెంట్ ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు తేనెపల్లి చిన్న, శ్రీధర్‌రాజు, విశ్రాంతి తహశీల్దార్ నగిరిపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

ప్రజాశక్తి-రామాపురం

మండల కేంద్రమైన రామాపురంలోని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి స్వగృహంలో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు ఆత్మీయ సమ్మే ళనం సమావేశం నిర్వహిస్తామని ఈ సమావేశాన్ని విజయవంతం చేయా లని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజక వర్గంలోని నాయ కులు, కార్యకర్తలు, బంధువులు, స్నేహితులు హాజరుకావాలని కోరారు.

స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న సిఐ సూర్యనారాయణ

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సిఐ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

త్వరలో రాష్ట్రంలో జరుగబోవు శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచు కొని మండలంలోని మొటుకుపల్లె పంచాయతీ ఆరుమనిపెంట పోలింగ్ కేంద్రాన్ని సిఐ సూర్యనారాయణ మంగళవారం తమ సిబ్బందితో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ క్షణంలోనైనా రాష్ట్రంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చునని,ఈ నేపథ్యంలో మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలకు వెళ్లకుండా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు సిఐ వెల్లడించారు.

పంచాయతీ ఉద్యోగుల నూతన కమిటీ ఏకగ్రీవం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే కోడూరులో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఇఒపిఆర్‌డి నాగార్జున రావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన కమిటీ అధ్యక్షులుగా ఈ శ్రీకాంత్‌బాబు, ఉపాధ్యక్షులుగా జి.రేవతి, కార్యదర్శిగా జి.పద్మభూషణ్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్.గౌరీశంకర్, సంయుక్త కార్యదర్శిగా వై సుబ్బరాయుడు,జిల్లా కౌన్సిలర్-1గా డి.ప్రకాష్ రాజు, జిల్లా కౌన్సిలర్-2గా బి.శివయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

మహారాజశ్రీ కడప 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 655/2021

ఎ.సుబ్బన్న, తండ్రి ఎ.సుబ్బన్న సాకిన్, డోర్‌నెం.53-19-8-1-4, రవీంద్రనగర్, కడప సిటీ.

...వాది

Vs

ఎర్రబోలు రామయ్య, తండ్రి గంగులయ్య, రిటైర్డ్ R&B NH. అక్కాయపల్లె, కడప. ప్రస్తుతం చిట్లూరు గ్రామం, రామాపురం మండలం, అన్నమయ్య జిల్లా.

...ప్రతివాది

పై నెంబరులోని వాది మీ వద్ద నుండి దావా మొత్తం రూ.1,97,244/- వసూలు కోరి పై దావా దాఖలు చేసియున్నారు. ప్రతివాది అయిన మీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న ఎడల 29-2-2024వ తేదీ ఉ॥ గం॥10.30 ని॥ పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల ఎక్సుపార్టీగా తీర్మానించబడును.

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

యం.వి.బాలిరెడ్డి, బి.ఎ.,బి.యల్.,
అడ్వకేటు, కడప. సెల్ : 9440118269.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

పుల్లంపేట: మండల పరిధిలోని రెడ్డిపల్లె ఎస్‌టి కాలనీలో మంగళవారం జీవనజ్యోతి ఆనందా నిలయం ఆధ్వర్యంలో వృద్ధులకు పేదలకు చత్రపతి శివాజీ జయంతి సందర్భంగా స్థానికుడు రమణ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో నరసింహులు, సుబ్బరామయ్య, దార్ల రమణ, ఈశ్వరయ్య, హరి,వెంకటేష్ పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి :'చింతల'

ప్రజాశక్తి-కలకడ

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బాటవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు)లో నిర్వహించిన వైఎస్‌ఆర్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొ న్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మహిళలు అన్ని రంగాలలో రాణించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి మహిళలకు ఎనలేని ప్రాముఖ్యతను ఇస్తున్నారని అన్నారు. మహిళా సంక్షేమం కోసం ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజలకు చేస్తున్న సేవలను గుర్తించి వచ్చే ఎన్నికల్లో మరోమారు ఆదరించాలని ఎంపిపి శ్రీదేవి రవికుమార్ పేర్కొ న్నారు. స్థాని కంగా ఉన్న నాయకులపై కొంత మేర అసంతృప్తి ఉన్నప్పటికీ సిఎం అంది స్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బరకం రవికుమార్ రెడ్డి కోరారు. అనంతరం ఎమ్మెల్యే మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని గ్రామాలలో ఉత్తమ సేవలు అందించిన వాలంటీర్లను ఘనంగా సన్మానించి ప్రోత్సా హక బహుమతులను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, ఎంపిటిసి కృష్ణారెడ్డి, సింగల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ మండల పార్టీ కన్వీనర్ కమలాకర్ రెడ్డి, సచివాలయ కన్వీనర్ మోహన్ రాజనాయుడు, షావత్ అలీఖాన్, ఇనాయతుల్లా, వట్టం మధుసూదన్‌రెడ్డి, కిషోర్ కుమార్, ఎంపిడిఒ పరమేశ్వరరెడ్డి, ఎపిఒ చెన్నకేశవులు, ఎంఇఒలు మునీంద్రనాయక్, రామచం ద్రారెడ్డి ఎపిఎం రమేష్, ఎస్ఐ రామకృష్ణారెడ్డి, పోలీసులు, సచివాలయ, వెలుగు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల

ఆర్ఆర్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలి

మాట్లాడుతున్న కాలాడి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డప్పగారి రమేష్‌కుమార్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలని లేకుంటే రాజీనామాలకు సిద్ధమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాలాడి ప్రభాకర్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు గొర్ల మోహన్‌రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం రమేష్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదు ర్కొని ముందుండి నడిపించారని అన్నారు. వైసిపి ప్రభుత్వ అరాచకాలు ఎదుర్కొంటూ కార్యకర్తలు కాపాడుకుంటూ పార్టీ ఆదేశించిన కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టా రని తెలిపారు. భవిష్యత్తు గ్యారంటీ, బాదుడే బాదుడు, అక్రమ అరెస్టులకు నిరసనలు, సభ్యత్వ నమోదు కార్యక్ర మాలు రాష్ట్రం లోని మొదటి స్థానంలో నిలిపారని పేర్కొన్నారు. రాయచోటి నియోజకవర్గంలో పార్టీ జెండాను రెపరెప లాడించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని తాము, కుతూహలంగా ఉన్నారని అన్నారు. కొందరు పనిగట్టుకుని రమేష్ కుమార్ రెడ్డి పనిచే యలేదని దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయ కుడు రమేష్‌కుమార్‌రెడ్డికి పార్టీ అధిష్టానం త్వరగా నిర్ణయం తీసుకొని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని, లేని పక్షంలో రమేష్‌రెడ్డికి మద్దతుగా తాము చేసిన రాజీనామాలు ఆమో దించాలని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు నాగేంద్రరెడ్డి, తిమ్మారెడ్డి ఉమాపతిరెడ్డి, శంకా రపు జయరామ్, అజంతుల్లా, వేమిరెడ్డి రవిరెడ్డి, బడుగు వాసు దేవుడు, వెంకటరామరాజు, ఎం.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన నవరత్నాల హామీలలో భాగంగా సొంత ఇళ్లు లేని ప్రతి పేదవానికి సొంతింటి కలను సాకారం చేయడంలో భాగంగా అర్హులందరికీ ఇంటి పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జగనన్న గృహ లబ్ధిదారులకు ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పాల్గొని వెయ్యి మంది లబ్దిదారులకు మంజూరైన ఇంటి పట్టాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీ లను వందశాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నారు. అనేక సంక్షే మ పథకాలను ప్రవేశపెట్టి పేదల జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. అందరికీ మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిషనర్ పి.ఆర్ మనోహర్, తహశీల్దార్ పుణ్యవతి, వైసిసి జిల్లా ఉపాధ్యక్షులు పాగొం డ ఖలీల్ అహ్మద్, వైసిపి పట్టణ కన్వీనర్ సిఆర్ చిన్నికృష్ణ, వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, సచివా లయ కన్వీనర్లు ఎస్ఎస్ ఫయాజ్, కళ్యాణ్ కుమార్‌రెడ్డి, చాంద్ బాషా, శెట్టిపల్లి రమేష్‌రెడ్డి, నక్క సంతోష్, జీవి రామకృష్ణ, వరప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి మెంబర్ కళ్యాణ్ కుమార్ రెడ్డి, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్‌బాషా, వైసిసి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ద్వారకనాథ్‌రెడ్డి

వాలంటీర్ల సేవలు మరువలేనివి :'కొరముట్ల'

చిట్వేలి: వాలంటీర్‌ను సన్మానిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

ప్రజాశక్తి-పుల్లంపేట

వాలంటీర్లే గ్రామ రథసారధులని, వాలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన గ్రామ, వార్డు వాలంటీర్ల సేవామిత్ర, సేవరత్న, సేవ వజ్ర పురస్కారాలకార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు.ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ మండలంలో గ్రామ వాలంటీర్ల సేవలకు గుర్తిం పుగా ప్రభుత్వం పురస్కారాలు అందిస్తుందని అన్నారు. వాలంటీర్లు ప్రతి గడపకు తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి వారధిగా నిలుస్తున్నారని కొనియాడారు. వాలంటీర్ల కృషిని తెలుసుకొని ప్రభుత్వం వాలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి నగదు ప్రోత్సాహంతో పాటు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వాలు 70 ఏళ్లలో చేయని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కేవలం ఈ ఐదేళ్లలో జగనన్న సహకారంతో పూర్తి చేశామని పేర్కొన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో అన్ని మండలాలలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసిన తీరును కార్యకర్తలు, నాయకులు ప్రతి ఓటరుకు తెలియజేయాలని తెలిపారు. కార్య క్రమంలో ఎపి టూరిజం డైరెక్టర్, మండల కన్వీనర్ వత్తలూరు సాయి కిషోర్‌రెడ్డి, ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకు మార్‌రెడ్డి, ఎంపిపి చీర్లనాగమ్మ, వైస్‌ఎంపిపి గౌరీ శంకర్‌రాజు, సుమిత్ర, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సర్పంచ్ జైపాల్ రెడ్డి, ఎంపిడిఒ కులాయప్ప,డిటి పీర్‌మున్ని రామమోహన్, వాలంటీర్లు పాల్గొన్నారు. **వీరబల్లి :** ఆపత్కాల సమయాల్లో వాలంటీర్లు అందించిన సేవలు మరువ లేనివని ఎంపిడిఒ రామ చంద్రారెడ్డి, డి.రాచపల్లి సర్పంచ్ నాగులమ్మ, వంగిమళ్ళ సర్పంచ్ సరస్వతమ్మ, సోమవారం సర్పంచ్‌లు తెలిపారు. మంగళవారం వంగిమళ్ళ, డి.రాచపల్లి గ్రామాల పరిధిలోని వాలంటీర్లను సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యాన్ని అందించే క్రమంలో వాలంటీర్లు పాత్రకీలకమని తెలి పారు. ప్రభుత్వ పథకాలు అవసరమైన వారి చెంతకు చేర్చడం, పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసువస్తున్నారని అన్నారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమం ద్వారా వారికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం 50శాతం పెంచి రెండు గ్రామా లకు కలిపి 32 మందికి సేవా మిత్ర అవార్డుకు రూ.15వేలు అందించడం సంతోషదాయకమని అన్నారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తూ, స్వలాభేక్ష లేకుండా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రామ చంద్రారెడ్డి, వైసిపి నాయకులు మాజీ ఎంపిటిసి జయ రెడ్డి, సర్పంచ్ తనయుడు రవి, ఎంపిటిసి నాగులయ్య, డిజిటల్ అసిస్టెంట్ వాత్స ల్య, సురేంద్రరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ కృష్ణయ్య, చిన్నరెడ్డప్పరెడ్డి, విఆర్ఒ హేమ నాథరెడ్డి, పంచాయతీ సెక్రటరీ జగదీష్ కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు. **చిట్వేలి:** మండల పరిధిలోని స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం జరిగిన గ్రామ, వార్డు, వాలంటీర్ల సేవలకు గాను ప్రభుత్వం నుంచి సేవా మిత్రా, సేవారత్న, సేవా వజ్ర పురస్కరాల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రైల్వే కోడూరు వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్, కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందించి ప్రజల సేవలో నిరంతరం అందుబాటులో ఉన్న వారిని గుర్తించి వారికి అవార్డులు అందించడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో ఎపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, సీనియర్ నాయకులు ఎల్వి మోహన్ రెడ్డి, ఎంపిపి చంద్ర, వైసిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్ మల్లిశెట్టి వెంకటరమణ, డైరెక్టర్ లింగం లక్ష్మీకర్, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఎంపిడిఒ రంగారావు, తహశీల్దార్ జ్ఞానేశ్వరి, వాలంటీర్లు పాల్గొన్నారు.

మహిళకు ఆరోగ్యశ్రీ కార్డును అందిస్తున్న ఎంపిడిఒ

పేదలకు వరం 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు పరుస్తున్నారని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం కొట్టాల గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరంలాంటిదని కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వైద్యశిబిరంలో డాక్టర్లు ఆశాలత, తేజశ్రీ వంశీధర్ ఒడ్డిలు 420 మందికి రోగులను పరీక్షించి వైద్య చికిత్సలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం లబ్దిదారు లకు ఆరోగ్యశ్రీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సహదేవరెడ్డి, ఆనంద్ కుమార్, ఎంపిటిసి సభ్యులు రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రెడ్డిపల్లె స్టేషన్‌కు స్టాపింగ్ కల్పించండి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని బ్రిటిష్ కాలం నాటి రైల్వే స్టేషన్ అయిన రెడ్డిపల్లి రైల్వే స్టేషన్‌లో ఇంటర్సిటి, అరకోణం స్టాపింగ్ కల్పించాలని మంగళవారం గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ వినీత్ సింగ్‌ను కలిసి వినతి పత్రం అందించినట్లు గుంతకల్ రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల-రేణిగుంట డెమో రైలును పుల్లంపేట, శెట్టిగుంట స్టేషన్లలో స్టాపింగ్ ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. రాజంపేట, రైల్వే కోడూరు రైల్వే స్టేషన్‌లో చెన్నై - ముంబై, చెన్నై సూపర్ ఫాస్ట్, హరిప్రియ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కల్పించాలని డిఆర్‌ఎంను దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. నందలూరు, ఓబులవారిపల్లె రైల్వే స్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్ కల్పించి, అయోధ్య రామ మందిరంకు వెళ్లేందుకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు చెప్పారు.

డిఆర్‌ఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న భరత్‌కుమార్‌రెడ్డి

వీరబల్లి: బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న వాలంటీర్

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని బొక్కలగడ్డ గ్రామానికి చెందిన నిరుపేద అయిన షేక్ నూర్‌బి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల దగ్గర దహన కార్యక్రమాలకు కూడా డబ్బులు లేవని తెలుసుకున్న ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి వాలంటీర్ మల్లీశ్వరి ద్వారా వారికి రూ.3వేలు ఆర్థిక సాయం అందించారు. గతంలో కూడా ఈ గ్రామంలో గుడిసెలు కాలిపోయినప్పుడు ఆర్థిక సాయంతో పాటు బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించి ఆదుకున్నారని గ్రామస్తులు తెలిపారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని పుల్లంపేటలో నివాసమున్న మారే లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి ఆమె భౌతికయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకి పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా తనను సంప్రదిస్తే నిరంతరం అందుబాటులో ఉండి సహకారం అందిస్తానని భరోసానిచ్చారు.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని డి.రాచపల్లి పంచాయతీ వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్‌ను ఎంపిడిఒ రామచంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా సిబ్బంది వైద్య సేవలు అందించాలన్నారు. నూతన భవనంలో టాయిలెట్స్, సింకులు మరమ్మతులు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆయన స్పందించి హెల్త్ క్లినిక్ సెంటర్‌లో చిన్నచిన్న మరమ్మతులు ఉంటే ఉంటే సరి చేయాలని పంచాయతీ సెక్రటరీ జగదీష్‌కుమార్‌కు సూచించారు. పాత హెల్త్ క్లినిక్ నుంచి కొత్తగా నిర్మించిన సెంటర్‌కు మారాలని వైద్య సిబ్బందికి సూచించారు. గ్రామంలో 16 మంది రోగులు హెల్త్ క్లినిక్ కి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారని, వారిలో ఇద్దరు గర్భిణులు ఉన్నారని సిహెచ్ఒ సురేఖ పేర్కొన్నారు.గర్భిణులకు ఆకు కూరలు, పండ్లు, కోడి గుడ్లు, పాలు వంటి పౌష్టిక ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు. రోగులకు ఎటువంటి సౌకర్యం, ఇబ్బంది తలెత్తకుండా సిబ్బంది సహనంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. సర్పంచ్ తనయుడు రవి, పంచాయతీ సెక్రటరీ జగదీష్ కుమార్, ఎఎన్ఎం చంద్రమ్మ ఉన్నారు.

కులగణన సర్వే త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన కులగణన సర్వే త్వరగా వంద పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు చొరవ చూపాలని ఎంపిడిఒ కృష్ణమూర్తి ఆదేశించారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయాల వారి కులగణన సర్వేపై ఆరా తీశారు. సర్వే వేగవంతం చేయాలని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాల న్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల విధులను బాధ్యతగా నిర్వర్తించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

నోడల్ అధికారులు వారికి కేటాయించిన ఎన్నికల విధులలో బాధ్యతగా నిర్వర్తించాలని స్పందన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం ఇవ్వాలని, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ ప్రక్రియ త్వరగా పూర్తవ్వాలని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు నోడల్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో స్పందన, సాధారణ ఎన్నికలు 2024, హౌసింగ్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, రీ సర్వే, తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ నోడల్ అధికారులు వారికి కేటాయించిన ఎన్నికల విధులలో బాధ్యతగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారంలో ఎన్నికల విధులలో ఉన్న అధికారులందరికీ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని శిక్షణకు సంబంధించిన నోడల్ అధికారులను ఆదేశించారు. దీనికి సంబంధించిన ఫారం 6,7,8 లపై తగు చర్యలు తీసుకోవా లన్నారు. ఓటర్ల జాబితా పై మీడియాలో వస్తున్న కథనాలను పరిశీలించి వాటిపై తగు చర్యలు తీసుకోవాలన్నారు.స్పందన అర్జీల గురించి సమీక్షిస్తూ అర్జీలను త్వరితగతిని పరిష్కరించాలని, అర్జీదారులకు పరిష్కారం ఇవ్వడంలో జాప్యం చేయరాదన్నారు. జగనన్న హౌసింగ్ కాలనీలలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిస్తూ ఇళ్ల నిర్మాణాల ప్రక్రియలో స్టేజి కన్వర్షన్ లలో ఏవైనా పెండింగ్ ఉంటే వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. సమీక్ష సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

క్రైం కార్నర్

పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రామాపురం

విశ్వనాథరెడ్డి(ఫైల్ ఫోటో)

మండలంలోని హసనాపురం పంచాయతీ మంగళపల్లి చెందిన కొవ్వూరి విశ్వనాథ్‌రెడ్డి(75) అనే వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ విఎల్.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిపారు. సోమవారం హసనాపురం నుంచి రాయచోటి పట్టణంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి మంగళవారం ఆటోలో హసనాపురం చేరుకున్నారని తెలిపారు. తన ఇంటికి వెళ్లకుండానే అక్కడి నుంచి తన తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్యకు ఇటీవలే చెయ్యి విరిగి తమ సమీప బంధువులు ఎవ్వరూ దగ్గరకు తీయకపోవడంతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి మృతి చెందాడని తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

15 మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని గువ్వల చెరువులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మూడే భాస్కర్‌నాయక్ అనే వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా మద్యం బాటిళ్లు అక్రమంగా అమ్ముతున్నారన్న సమాచారం రావడంతో మంగళవారం తన సిబ్బందితో దాడి చేసి భాస్కర్‌నాయక్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అతని వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం పరచుకొని తనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.